క్లుప్తంగా

విరాళం అందజేత



రూ.50వేల చెక్కు అందజేస్తున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ నవీన్‌రావు

నల్లగొండ టూటౌన్ : అంధుల సంక్షేమానికి హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ పి.నవీన్‌రావు శనివారం హైదరాబాద్‌లో డ్వాబ్ కార్యదర్శి పానుగోటి చొక్కారావుకు రూ.50వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా చొక్కారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అంధుల సంఘానికి సాధికారత కల్పించాలనే లక్ష్యం, అంధుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు పోతున్నామన్నారు. గతంలో హామీ ఇచ్చిన మేరకు జడ్జి నవీన్‌రావు వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా చెక్కు అందించడం అభినందనీయమన్నారు. అదే విధంగా ఎమ్మెల్సీ కోదండరాంను డ్వాబ్ బృందం కలిసి ఫొటో అల్బమ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.అజీజ్‌కుమార్, పరమేష్ పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌గా కత్తుల కాన్షీరామ్



కత్తుల కాన్షీరామ్

కేతేపల్లి : బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్‌గా కట్టంగూర్ మండలంలోని కలిమెర గ్రామానికి చెందిన కత్తుల కాన్షీరామ్ నియమితులయ్యారు. శనివారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా బీఎస్పీ ముఖ్య నాయకుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ కాన్షీరామ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

కబ్జాదారులకు నోటీసులు

మునుగోడు : పట్టణంలో కొంతకాలంగా రోడ్డును కబ్జా చేసి అక్రమంగా కట్టడాలు చేపట్టిన స్థలాలను వదిలేయాలని మునుగోడు గ్రామపంచాయతీ అధికారులు శనివారం కబ్జాదారులకు నోటీసులు అందించారు. మునుగోడు పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే విడతల వారీగా నిధులు మంజూరు చేయిస్తుండడంతో ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న మునుగోడు-నల్లగొండ, చండూరు-మునుగోడు రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరిస్తుండడంతో పాటు సెంట్రల్ లైటింగ్, రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీల ఏర్పాటు చేస్తున్నారు. కానీ రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలం లేకపోవడంతో రోడ్డును ఎవరెవరూ ఎంతా కబ్జా చేశారో గుర్తించి మార్కింగ్ చేశారు. అంతే కాకుండా మునుగోడు-నల్లగొండ-చౌటుప్పల్ రోడ్డులో ఒకొక్కరూ అర ఫీట్ నుంచి 4ఫీట్ల వరకు కబ్జా చేసిన 184మందిని గుర్తించి వారికి నోటీసులు అందజేశారు. వారు వారంరోజుల్లో తమ కట్టడాలను స్వచ్ఛందంగా కూల్చివేసుకోవాలని, లేకుంటే తామే కూల్చివేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన, సీమంతాలు



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సూపర్‌వైజర్లు

మర్రిగూడ : మండలంలోని ఖుదాభక్షపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు ముమ్మడి యశోద, శ్రీలతల ఆధ్వర్యంలో శనివారం గర్భిణులకు సీమంతాలతో పాటు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు చేసుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా బీకేతండాలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించడంతో పాటు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విఘ్నేశ్వరి, విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

కరపత్రాలు విడుదల



ప్రచార కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నకిరేకల్ : పీడీఎస్‌యూ అర్ధశతాబ్ద ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంఘం పూర్వ జిల్లా కార్యదర్శి చెరుకు సతీష్ కోరారు. ఈనెల 21న నల్లగొండలో, 24 ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే ఉత్సవాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆయన శనివారం పట్టణంలో విడుదల చేసి మాట్లాడారు. శాస్త్రీయ విద్యాసాధన, విద్యారంగ సమస్యల పరిష్కారం, విద్యార్థి హక్కుల, సమానత్వం కోసం పీడీఎస్‌యూ అనేక అలుపెరగని పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. ఈ పోరాటాల్లో అనేక మంది విద్యార్థి నాయకులు తమ జీవితాలను ప్రాణాలను సంఘానికి దార పోశారని అన్నారు. ఈ అర్ధశతాబ్ద ఉత్సవాల్లో మేధావులు, ప్రగతిశీల శక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇందూరు సాగర్, అంబటి చిరంజీవి, చెరుకు సైదులు, పిట్టల అనిల్, యాకయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




క్లాత్ షాపింగ్ మాల్స్‌లలో కొనుగోలుదారుల సందడి

కార్పొరేట్ మార్కెట్

నీలగిరిలో విస్తరిస్తున్న షాపింగ్ మాల్స్

నల్లగొండ పట్టణంలో కొత్త ట్రెండ్ మొదలైంది. ఇక్కడికి కార్పొరేట్ మార్కెట్ వచ్చేసింది. ఒకప్పుడు హైదరాబాద్‌కు నగరానికే పరిమితమైన షాపింగ్ మాల్స్ ఇప్పుడు జిల్లా కేంద్రంలోనూ వెలిశాయి. రాజధానికి కూతవేటు దూరంలో ఉండడంతో ఇక్కడి ప్రజలు గతంలో షాపింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లేవారు. ఇప్పుడు పెద్దపెద్ద బ్రాండెడ్ షాపింగ్ మాల్స్ ఇక్కడికే రావడంతో దూరభారం తగ్గుతుండడంతో వినియోగదారులు నల్లగొండలోనే షాపింగ్ చేస్తున్నారు.

– రామగిరి (నల్లగొండ)



ప్రజల లైఫ్‌స్టైల్ మారింది. వారి అభిరుచులకు తగ్గట్టుగా కార్పొరేట్ స్థాయిలో జిల్లా కేంద్రంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ ఏర్పాటయ్యాయి. ఇక్కడ వినియోగదారులకు కావాల్సిన వస్తువులన్నీ ఒకేచోట అందుబాటులో ఉంటున్నాయి. ఒకప్పుడు షాపింగ్ చేయాలంటే వేర్వేరు దుకాణాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆ తర్వాత కాలంలో ఒక సెంటర్‌లో వివిధ రకాల దుకాణాల సముదాయాలు ఏర్పాటయ్యాయి. కానీ ఇప్పుడు ఒకే బిల్డింగ్‌లో అన్ని వస్తువులు దొరికేలా షాపింగ్ మాల్స్ వెలిశాయి. వాటిలో ప్రధానంగా మోర్ మార్కెట్, రిలయన్స్ మార్ట్, రిలయన్స్ ట్రెండ్స్, ఈజీ బై, విశాల్ మార్ట్ పేరుతో షాపింగ్ మాల్స్ ఏర్పాటయ్యాయి. వీటిలో ఇంటికి కావాల్సిన నిత్యావసర సరుకులు, రెడిమేడ్ దుస్తువులు, చెప్పులు, ఎలక్ట్రికల్ వస్తువులు ఇలా అన్ని రకాల బ్రాండ్ల వస్తువులు ఒక్కచోటే దొరుకుతున్నాయి. అయితే.. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ వెలసినా నల్లగొండ పట్టణంలోని ఎస్పీటీ మార్కెట్, ఎస్పీ ఆఫీసు సమీపంలో ఎల్‌పీటీ మార్కెట్లకు కూడా ఆదరణ తగ్గలేదు.

షాపింగ్ తేలికగా పూర్తవుతుంది



ఏదైనా పండుగ, శుభకార్యం ఉందంటే అంతా కలిసి షాపింగ్ మాల్స్‌కి వస్తాము. ఇక్కడ పిల్లలకు, పెద్దలకు కావాల్సిన దుస్తులు అన్నీ ఒక్కచోటే లభిస్తాయి. ప్రత్యేకంగా బయట తిరగాల్సిన అవసరం ఉండదు. షాపింగ్ తేలికగా అయిపోతుంది.

– నూకల మౌనిక

అన్ని బ్రాండ్లు ఉంటాయి

రిలయన్స్ ట్రెండ్స్‌లో అన్ని రకాల బ్రాండెడ్ దుస్తులు, ఇతర వస్తువులు అందుబాటులో ఉంటాయి. ఒకేచోట బ్రాండెట్ వస్తువులు ఉండడంతో వినియోగదారులకు షాపింగ్ తొందరగా అయిపోయింది. అంతే కాదు పండుగలకు ప్రత్యేక ఆఫర్‌లు ఉండడంతో తక్కువ ధరకు దుస్తులు పొందవచ్చు.

– నవీన్, స్టోర్ మేనేజర్, రిలయన్స్ ట్రెండ్స్



ప్రస్తుతం వినియోగదారులు బ్రాండెట్ వస్తువులకు అలవాటు పడ్డారు. దీనికి అనుగుణంగా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల పేరుతో ప్రత్యేక షోరూమ్‌లు వెలిశాయి. ప్రముఖ చెప్పులు, రెడిమేడ్ దుస్తుల కంపెనీల షోరూమ్‌లు పెట్టారు. హైదరాబాద్ రోడ్డులో నూతనంగా బాటా, పారాగాన్, పాపులర్, రిలయన్స్ ఫుట్ ప్రింట్ చెప్పుల షోరూమ్‌లు ఏర్పాటయ్యాయి. రెడిమేడ్ కంపెనీలు అలెన్ సోలెన్, రామ్‌రాజ్ కాటన్, పాన్ అమెరికా, లూయిస్ ఫిలిప్స్, క్లాసిక్ పోలో, జాకీ, రిలయన్స్ ట్రెండ్స్ ఉన్నాయి.



బ్రాండెడ్ దుస్తులకు ఆదరణ



మార్కెట్‌లో బ్రాండెడ్ రెడిమేడ్ దుస్తులకు ఆదరణ ఉంది. కొన్నిచోట్ల వినియోగదారులకు కావాల్సిన బ్రాండెడ్ దుస్తులు.. అన్ని షోరూమ్‌లలో లభించవు. అవి బ్రాండెడ్ షోరూమ్‌లలోనే దొరుకుతాయి. ఇక్కడ నకిలీవి ఉండవు. షోరూమ్ గ్యారంటీ కూడా ఇస్తుంది.

– ఎంఏ.జబ్బార్, క్లాసిక్ పోలో షోరూమ్, యజమాని

సమయం ఆదా అవుతుంది



షాపింగ్ మాల్స్‌లో అన్ని వస్తువులు ఒక్కచోటే కొనుగోలు చేయొచ్చు. ఒకప్పుడు షాపింగ్ చేయాలంటే ప్రత్యేకంగా హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అన్ని బ్రాండెడ్ షోరూమ్‌లు నల్లగొండలో ఉన్నాయి. దీంతో సమయం, డబ్బు రెండు ఆదా అవుతుంది.

– అంజన్ కుమార్

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి దీప్తి, తదితరులు

నకిరేకల్ : వృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత వారి పిల్లలదే అని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.దీప్తి అన్నారు. శనివారం మండలంలోని తాటికల్ గ్రామంలో గల వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వృద్ధులైన తల్లిదండ్రులను వారి పిల్లలు ఏవిధంగా చూసుకోవాలో ఆమె వివరించారు. కార్యక్రమంలో మహిళా శిశు వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ జిల్లా అధికారి మునగాల నాగిరెడ్డి, లయన్స్ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ కందాల పాపిరెడ్డి, నవ్య క్లబ్ ప్రతినిధులు కె.స్వప్నారెడ్డి, ఎస్.రమాదేవి, డాక్టర్ వీరబ్రహ్మం, యాదగిరిరెడ్డి, శంభులింగారెడ్డి, కందాల లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యచంద్రరావు, ఎస్.రాంమోహన్ రావు, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



నకిరేకల్ : పీఆర్‌టీయూ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నకిరేకల్ : పట్టణంలోని పీఆర్‌టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఉపాధ్యాయినులు శనివారం కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. ఈ సంబరాల్లో నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం మండలాల ఉపాధ్యాయినులు పాల్గొని ఆడిపాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు కస్తూరు చరణ్, పీఆర్‌టీయూ గౌరవ అధ్యక్షురాలు కడారి అనిత, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కాలేజీలో విద్యార్థులు బతుకమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల పూలతో తయారు చేసిన బతుకమ్మలను తీసుకొచ్చి ఆడి పాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహమ్మద్ ఇస్మాయిల్, అధ్యాపకులు కమర్‌సుల్తానా, నేమత్ సుల్తానా, నడింపల్లి వెంకటేశ్వర్లు, వెంకటేష్, సంజీవ్ ప్రకాష్, అంజిబాబు, అస్మ ఆరీఫ్, యామిని, విద్యార్థులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

కంఠమహేశ్వరస్వామి కల్యాణం

కట్టంగూర్ : గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీకంఠమహేశ్వరస్వామి సురమాంబాదేవి కల్యాణాన్ని శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకాఎల్లమ్మ, వనం మైసమ్మ దేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గౌడ కులస్తులంతా గంపల్లో మోకు ముస్తాదులను ఉంచి, మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవార్లకు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షుడు కొంపెల్లి యాదయ్య, గౌడ కులస్తులు పాల్గొన్నారు.



గంపలు, బోనాలతో వెళ్తున్న గౌడ కులస్తులు

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వినతి

నల్లగొండ రూరల్ : ప్రభుత్వం దసరా లోపు ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరుతూ తెలంగాణ అఫ్లియేటెట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి, కార్యదర్శి ఎం.సైదారావు, నర్సింహారెడ్డి, జానయ్య, శ్రీనివాస్‌రెడ్డి శనివారం మహాత్మగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎ.రవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేసిందని, తక్షణమే విడుదల చేయాలని వారు కోరారు. గత మూడేళ్లుగా రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో బోధనా సిబ్బంది జీతాలు, భవనాల అద్దెలు, కరెంట్ బిల్లు, భవన పనుల చెల్లింపు ఇబ్బందిగా మారిందన్నారు. అప్పులు తీసుకొచ్చి కళాశాల నిర్వహణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే దసరా తర్వాత కళాశాలలను నిరవధికంగా బంద్ చేయడానికి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయించిందని రిజిస్ట్రార్‌కు తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ సభ్యులు

పవర్‌లూమ్ కార్మికుల కూలి రేట్లు పెంచాలి



సమ్మె నోటీసు ఇస్తున్న యూనియన్ నాయకులు

నల్లగొండ టౌన్ : పెరుగుతున్న ధరల కనుగుణంగా పవర్‌లూమ్ కార్మికుల కూలి రేట్లు పెంచాలని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య కోరారు. ఈనెల 20తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు శనివారం పద్మానగర్‌లోని పవర్‌లూమ్ యజమానుల సంఘం అధ్యక్షుడు చెరుపల్లి శ్రీనివాస్‌ను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్చి 31తో అగ్రిమెంట్ గడువు ముగిసియడంతో రేట్లు పెంచాలని యజమాన్యానికి చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారని, దీంతో ఈనెల 20 తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో గంజి నాగరాజు, పెండెం బుచ్చిరాములు, చిట్టిపోలు వెంకటేశం, సురపల్లి భద్రయ్య, దేవులపల్లి గిరిబాబు, నిమ్మనగోటి సైదులు, మేడిపల్లి సత్తయ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వేప మొద్దుల వేలం

కేతేపల్లి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల, గ్రంథాలయ ఆవరణలో కూలిన వేపచెట్ల మొద్దులను విక్రయించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఐదుగురు ఒకొక్కరు రూ.1000డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. సూరోజు నాగాచారి అత్యధికంగా రూ.20వేలకు వేలంలో వేపమొద్దులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన సైదాచారి

తిప్పర్తి : మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన బసవోజు సైదాచారి (41) శనివారం ఉదయం ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడికి మతిస్థిమితం లేదని ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్ నంబర్ 8712670181కు సమాచారం అందించాలని ఎస్‌ఐ తెలిపారు.

కోలాట బృందానికి చీరల పంపిణీ

శాలిగౌరారం : మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన మహిళా కోలాట బృందానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి శనివారం గ్రామంలో చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చీరల దాత బోడ అరుణ్‌కుమార్, మాజీ వైస్‌ఎంపీపీ భూపతి అంజయ్య, నాయకులు షేక్ ఇంతియాజ్, బోడ విజయ్, చింత ధనుంజయ్, బోడ ప్రభాకర్, షేక్ జహంగీర్, నల్లగొండ శ్రీనివాస్, నిమ్మల కృష్ణ, గునగంటి శంకర్, సింగం జాన్, కడమంజి సాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

శాలిగౌరారం: మండలంలోని అడ్లూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 11 మందిని శనివారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్లూరు గ్రామంలో కొంతకాలంగా పేకాట ఆడుతున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్‌ఐ డి.సైదులు తన సిబ్బందితో కలసి శనివారం సాయంత్రం గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు అరెస్టు చేయగా మరో ఆరుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.12,600 నగదు, 14 బైక్‌లు, 11 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కార్మికులకు చీరలు, నగదు అందజేత

చిట్యాల : మున్సిపాలిటీలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు దసరా పండగ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు, బీజేపీ నాయకుడు కునూరు సంజయ్‌దాస్‌గౌడ్ చీరలు, రూ.5వేల నగదును శనివారం అందజేశారు. అదే విధంగా పురుష కార్మికులకు రూ.10వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జడల నర్సింహ, వెల్దుర్తి రాజు, పురం ప్రశాంత్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గడ్డం వెంకటస్వామికి ఘన నివాళులు

నల్లగొండ : కలెక్టరేట్‌లో దివంగత కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం వెంకటస్వామి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామి చిత్రపటానికి ఎస్పీ నివాళి

నల్లగొండ క్రైం : పట్టణంలోని పోలీస్ జిల్లా కార్యాలయంలో శనివారం దివంగత మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ పాల్గొని వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ఈతఈ రాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చండూరు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వెంకటస్వామి (కాకా) జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కార్యాలయం సూపరింటెండెంట్ నర్సింహ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యాలయంలో ఎంపీఓ మాధవరెడ్డి, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయలక్ష్మి, ఎంపీఓ రమేష్, ఏపీఓ శ్రీలత, ఏపీఎం పద్మ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ : కలెక్టరేట్‌లో వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్



నల్లగొండ టూటౌన్ : నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి

అన్నపూర్ణాదేవి అవతారంలో దుర్గామాత



నల్లగొండ : శాంతినగర్‌లో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి



నల్లగొండ : రాక్‌హిల్స్ కాలనీలో భక్తుల పూజలు



నల్లగొండ : శ్రీనగర్‌కాలనీలో అమ్మవారి వద్దకు కలశాలతో వస్తున్న భక్తులు



నల్లగొండ : కనకదుర్గ ఆలయంలో పూజలు



నార్కట్‌పల్లి : పూజలు చేస్తున్న భక్తులు

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

చిట్యాల : వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు మండలంలోని వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని వెలిమినేడు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట వైస్‌చైర్మన్ బొంతల అంజిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్‌లు కొంపెల్లి వెంకట్‌రెడ్డి, చీమల వీరేశం, నాయకులు అంతటి నర్సింహాగౌడ్, మారగోని యాదయ్య, గోలి గణేష్, రైతులు ఉన్నారు.

నకిరేకల్ : గ్రామాల్లో వరికోతలు ప్రారంభమైనందున ధాన్యం కొనుగోళ్లకు తగిన ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై నిర్వహించిన మండల స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధాన్యం కేంద్రాల నియమనిబంధనలపై అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ జమురుద్దీన్, మండల వ్యవసాయాధికారి జానిమియా, ఏకేపీ ఏపీఓ నరహరి, సీసీలు కొండా మట్టయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం

శాలిగౌరారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ధాన్యం కొనుగోళ్లపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పి.యాదగిరి పాల్గొని మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఏపీఎం జానకి, పీఏసీఎస్ సీఈఓ నిమ్మల ఆంజనేయులు, ఎంఈఓ శ్రవణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాలను కాపాడేందుకే బెల్టుదుకాణాల మూసివేత

మునుగోడు : గ్రామాల్లో ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకే ఎమ్మెల్యే బెల్టు దుకాణాలను మూసివేయిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొంపల్లిలో బెల్టు దుకాణాలు మూసివేయాలని కోరుతూ కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. గ్రామాల్లోని బెల్టుదుకాణాల కారణంగా అనేక మంది పేదలు నిత్యం మద్యం సేవించి అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు వెదిరె మేఘారెడ్డి, మాజీ ఎంపీపీలు పోలగొని సత్యం గౌడ్, కర్నాటి స్వామి, నాయకులు నన్నూరి విష్ణువర్ధర్‌రెడ్డి, జాల వెంకన్నయాదవ్, వెంకన్న, అంజయ్యగౌడ్, యాదయ్యగౌడ్, అప్పారావు, గోవర్ధన్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.